నాగరికులు

ఉదయం ఆరు గంటలకు రావలసిన బండి రెండు గంటలు లేటు. పార్వతి కేమీ తోచక బెంచీమీద చతికిల బడింది. ఈ బండికోసమని ప్రొద్దున్నే 5 గంటలకల్లా లేచి తొందర తొందరగా రావలసివచ్చింది. తీరా వస్తే బండి లేటు. స్టేషనులో ప్రయాణీకులు పెట్టెలమీద, బెడ్డింగులమీద కూర్చుని బండికోసం నిరీక్షిస్తున్నారు. బండి ఆలస్యంగా వస్తూందంటే ఎవరికీ చిరాకెయ్యదు. తమకాలం వృధాగా వ్యయమౌతూందని ఎవరూ విచారించరు. బళ్ళు లేటుగా రావడమనేది నిర్వహణంలోని అసమర్ధతను సూచిస్తుందని ఎవరికీ తట్టదు. బళ్ళు ఆలస్యంగా రావడం, వాటికోసం పడిగాపులు పడడం అందరికీ అలవాటైపోయింది మరి! రోజూ చచ్చేవాడికోసం ఎంతకని ఏడుస్తారు? అందుకే పల్లెటూరి ప్రయాణీకులు బుకింగ్ ఆఫీసుదగ్గరకొచ్చి "బాబూ, తొమ్మిది గంటల బండి ఎన్ని గంటలకొస్తాది బాబూ" అని అమాయకంగా అడుగుతారు. పార్వతి తనలో తనే నవ్వుకుంది.

కొళాయిచుట్టూ జనం మూగేరు. ఆడవాళ్ళూ, మొగవాళ్ళూ మొహాలు కడుగుతున్నారు. స్టేషనుదగ్గర నున్న వేపచెట్టు పుల్లలు విరిచి పళ్ళు తోముతున్నారు. ఒక వస్తాదు అక్కడే స్నానం చేస్తున్నాడు. సమంగా చెంబు తోముకోనిచ్చారు కారని, ఒక మార్వాడీ అక్కడివాళ్లతో పోట్లాడుతున్నాడు. ఒకరి భాష వొకరికి రాదు. ఎవరిభాషలో వాళ్లు గట్టిగా కేకలేస్తున్నారు. అనువదించడానికి దుబాషివుంటేగా!

బెల్లంముక్కమీద ఈగలు ముసిరినట్టు కాఫీదుకాణం చుట్టూ మనుషులు మూగేరు. కాఫీ, ఇడ్లీ వగైరా సేవిస్తున్నారు. కమ్మటి పెసరట్టు వాసన పొయ్యిదగ్గిర బయలుదేరి తెరలు తెరలుగావచ్చి స్టేషనంతా వ్యాపించింది. బండి లేటుగా వచ్చిందంటే దుకాణదారుడు పదిరూపాయల బేరం అదనం చేసుకున్నాడన్నమాటే.

బాగా తెల్లవారింది. సూర్యోదయముకూడా అయింది. ఎదురుగుండా రైలుపట్టాలమీద సూర్యకిరణాలుపడి తళ తళ మెరుస్తున్నాయి. గూడ్సుబళ్ళు అటూ ఇటూ తిరుగుతున్నాయి. రైల్వే కార్మికులు పుడకలతో పళ్లు తోముకుంటూ, చేత్తో జండాలు చూపిస్తూ, రైలుపట్టాలు మారుస్తూ తమ పనులు చేసుకుపోతున్నారు. కొందరు రైలుపట్టాలమీదే కూర్చుంటారు! బండి తమదగ్గరకొచ్చేవరకు లేవరు! అసలు రైల్వేయార్డులోకూడా అతి నిర్భయంగా ఇంట్లో తిరిగినట్టే తిరుగుతారు! అవును మరి! జాలరివాళ్లు సముద్రాన్ని కోనేటికన్నా అన్యాయంగా చూస్తారు! పాములవాడు పాములంటే భయపడతాడా?

పార్వతి కేమీ తోచక పుస్తకాలదుకాణంవైపుకి బయలుదేరింది. రైల్లో చదువుకునేందుకు పత్రిక లేవైనా కొనాలని అనుకుంది. అబ్బ! ఎన్ని పత్రికలు! కాని వాటిలో మంచి పత్రికలు నూటికి రెండు మూడుకంటె ఎక్కువ లేవు, చాలవరకు సినిమా పత్రికలే!

"ఏమిటండీ వెదుకుతున్నారు?" అన్నాడు ఆ పక్కనున్న పెద్దమనిషి.

ఆమె తల ఎత్తి పెద్దమనిషివేపు చూచింది. పెద్దమనిషి ముప్ఫయ్యేళ్ల యువకుడు. సింహాలు, పులులు, దుప్పులు తదితర జంతుకోటి బొమ్మలున్న అమెరికన్ బుష్‌షర్టు వేసుకున్నాడు. తలకి ఈవినింగ్ హేట్, నోట్లో పైపు, చేతిలో నాలుగైదు అమెరికన్ పత్రికలు-లైఫ్, ట్రూస్టోరీ, పోస్ట్, ట్రూరోమాన్స వగైరా వగైరా.

"నువ్వు నన్ను గుర్తుపట్టినట్టులేదు" అన్నాడాయన ఇంగ్లీషులో.

పార్వతి ఒక నిమిషం గాభరాపడింది. "నేను కె. ఎస్. చారిని" అన్నాడు ఆచారి.

పార్వతి తలదించుకుంది. ఆమె మొహం ఎర్రబడింది. ఆమె గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఆచారి ఆమె మాట్లాడడానికి అవకాశం ఇవ్వలేదు. "ఈయన నీకు తెలుసా" అని ప్రక్కనే తదేక దీక్షగా పుస్తకాలు చూస్తున్న రామాన్ని జబ్బపట్టుకు లాగాడు. రామం తృళ్ళిపడిచూసేడు.

"ఓహో పార్వతి, ఇలా వచ్చావేం, మామయ్యగారింటినుంచా ?" అన్నాడు రామం.

"అవును. సెలవలకు విజయవాడ వెళ్ళాలనుకుంటు న్నాను" అంది పార్వతి.

"ఆచారికూడా నాకిక్కడే ఒక అరగంటక్రితం కలిశాడు. నాలుగేళ్ళలోను ఎంత మారిపోయాడో చూశావా పార్వతీ, మొదట పోల్చుకోలేకపోయాను" అన్నాడు రామం.

"ఎన్నాళ్ళయింది అమెరికానుంచి వచ్చి ?" అన్నది పార్వతి తలదించుకొని.

"సుమారు ఏడాది కావచ్చింది" అన్నాడు ఆచారి నిబ్బరంగా.

"అమెరికాలో యింత చదువు చదివి వొస్తే ఏడాదయినా యింకా ఉద్యోగం దొరకలేదోయ్! చిత్రంగా ఉందే!" అన్నాడు రామం నవ్వుతూ.

"పెద్ద ఉద్యోగం కావాలంటే కొంతకాలం పడుతుంది మరి" అన్నాడు ఆచారి సీరియస్‌గా.

అక్కడికి చిన్న ఉద్యోగాలు తేలిగ్గా దొరుకుతున్నట్టు. ఒకమూల ఉద్యోగంలేక అవస్థపడుతున్నా, ఈ వ్యవస్థ తనకన్యాయం చేస్తున్నా, అన్యాయాన్ని సమర్థించడం నాగరికత కాబోలు! పోనీ ఆచారి చాల డబ్బున్నవాడేం కాదు. వాళ్ళ నాన్న ఒక హైస్కూలుకి హెడ్‌మాస్టర్‌గా పనిచేశాడు. హెడ్‌మాస్టరంటే ఏమిటుంటుంది. పేరు గొప్ప ఊరు దిబ్బ గాని, పిల్లల పెళ్ళిళ్ళూ, చదువులూ అయ్యేసరికి ఆర్జించింది కాస్తా పచ్చకర్పూరంలా హరించిపోయింది. ఆచారి బి. ఎస్. సి. ఆనర్సు ప్యాసయి, ఈలోగా స్కాలర్‌షిప్ సంపాదించి అమెరికా వెళ్లాడు. చదువులోమాత్రం ఆచారి గట్టివాడు, ఏమాట కామాటే చెప్పుకోవాలి!

రామానికి ఆచారి చిన్ననాటినుండి తెలుసు. ఇద్దరూ కలసి ఇంటరువరకూ చదువుకున్నారు. ఆచారికుటుంబంలో అంతా సనాతనులు. అతనితండ్రి పరమచాదస్తుడు. ఇంటర్‌మీడియట్‌వరకూ ఆచారికి తలమీద ముడి వుండేది. కాలేజీలో అంతా వేళాకోళంచేసేవారు. ఇప్పుడు ఆచారి చాల మారిపోయాడు.

పార్వతి తండ్రి, ఆచారితండ్రీ చిన్ననాటి స్నేహితులు, ఒక శాఖవాళ్లూను. పార్వతితండ్రి ప్లీడర్ చేసి కొంచెం గడించేడు. అయితే ఆయన చాల మంచివాడు. విద్యావంతుడు. నిగర్వి. పాపం మగసంతానం లేదు. అందుచేత ఆయనకు పార్వతి అంటే పంచప్రాణాలున్నూ, ఆమెకు మంచిసంబంధం చూసి పెళ్ళిచెయ్యాలని ఆయన కోరిక. అయితే ఆఖరికి మంచి సంబంధమే నిశ్చయించాడు. సాంప్రదాయకమైన కుటుంబం. కుర్రవాడు తనకళ్లముందే పెరిగి పెద్దవాడయ్యాడు. ఉన్నతవిద్య అభ్యసించేడు. ఆచారి తండ్రికూడా అందుకు వొప్పుకున్నాడు. నిజంగా పార్వతి అదృష్టవంతురాలే.

"నీకు పార్వతి యింతకు మునుపు తెలుసునన్నమాట." అన్నాడు ఆచారి రామంతో.

"బాగా అన్నావ్! వారి కుటుంబమంతా మాకు మిత్రులే. మా నాన్నగారు విజయవాడలో పనిచేసినప్పుడు వారింటి ప్రక్కనే వుండేవాళ్లము. పార్వతి నాన్నగారిదగ్గిర మా కెంతో చనువు వుండేది. ఆయన పండితులు. చేసేది ప్లీడరీ అయినా మంచి రసికులు. సంస్కృత కావ్యాల్లోని రస వంతమైన శ్లోకాలు చదివి మాకు అర్థం చెప్పేవారు. ఆ రోజులు చాల హాయిగా వుండేవి"

"పోనిస్తూ, ఆయన వొట్టి చాదస్తుడు. ఆయన్ని నువ్వే పొగడాలి" అని ఆచారి పెదవి విరిచేడు.

"అవున్లేవోయ్, అంతా మీలా గేదొరలెలాగవగలరు?"

ఆయన నీకు కాబోయే మామగారని చెప్పుకోవడం నీకు చిన్నతనంగా ఉన్నట్టుంది. పాపం! అని రామం పార్వతి

వేపు చూసి నవ్వేడు.

పార్వతి సిగ్గుపడలేదు. కాని అభిమానంతో కృంగి పోయింది. తండ్రి నెవ రేమన్నా ఆమెమనస్సు చాలా బాధ పడుతుంది.

నిజమే. ఆయన పూర్వాచారపరాయణుడు. అయితే మట్టుకు ఆయన విద్యావంతుడు. నిరాడంబర జీవి. దాన ధర్మాలు చేసిన కర్మిష్టి. ఆయన అనేకమందికి చదువులు చెప్పించేడు. పెళ్ళిళ్ళు చేయించాడు. దయార్ద్ర హృదయుడు. పార్వతికి తండ్రితో అనేక అభిప్రాయభేదాలున్నాయి. కాని ఆయనంటే ఎంతో గౌరవభావం. అటువంటి తన తండ్రిని గురించి ఆచారి తేలిగ్గా మాట్లాడితే పార్వతికి కష్టంగానే వుంటుంది.

రామం నిశ్శబ్దాన్ని భంగంచేశాడు. "కాని ఆచారి నిజంగా ఎంతమారిపోయాడు! అవునుగానీ, ఒకమాట చెప్ప వోయ్! ఆచారీ, యీ బుష్‌కోటుమీద యీ అడివి మృగా లేమిటోయ్! రాజమండ్రీ ఇది వేసుకునే వెళ్తావేమిటీ కొంపదీసి కుక్కలు వెంటపడగలవు. అదేం వాషింగ్‌టన్ కాదు తెలుసా?" అన్నాడు రామం నవ్వుతూ. పార్వతి పకపక నవ్వింది. ఆచారి కిదేం నచ్చలేదు. ఈ ధోరణిని ఎలా గైనా తప్పించాలనుకున్నాడు. రామాన్ని తీసుకుని టిక్కెట్లు కొనడానికి బయలుదేరేడు. ట్రెయినొచ్చే వేళకూడా అయింది.

ప్లాటుఫారంమీదికి బండి రానేవచ్చింది. పార్వతి ఆచారి, రామం ఇంటరుక్లాసు పెట్టెలో కెక్కి కూర్చున్నారు. పెట్టెలో అయిదారుగురు ప్రయాణీకుల కంటె ఎక్కువ లేరు.

ఆచారి హడావుడిగా సామాన్లుసర్ది, బెంచీమీద కూర్చుని రుమాలుతో, చెమటతుడుచుకున్నాడు. రామం వాళ్ళ కెదురుగా బల్లమీద కూర్చుని పార్వతివేపు పరిశీలనగా చూసేడు.

పార్వతి తలవంచుకుని జెడలో సంపెంగలు ముడుచుకుంటూంది. నల్లగా తాచుపాములాంటి ఆ జడ అతిబరువుగా జారుతూంది. పార్వతికి విద్యావంతుడైన భర్త లభింపనున్నాడు. ఆచారి పెద్దఉద్యోగం చేస్తాడు. కావలసినంత ఐశ్వర్యం. ఏ నగరంలోనో పెద్దబంగళా, పువ్వులతోట, కారు, నౌకర్లు, జీవితం హాయిగా, దర్జాగా గడుపుతుంది. నిజంగా పార్వతి అదృష్టవంతురాలు, అనుకున్నాడు రామం.

పార్వతి తలెత్తిచూసింది. రామం మొహం ప్రక్కకి తిప్పి స్టేషన్‌లోకి చూసేడు. కిటికీలోంచి గాలి తెరలు తెరలుగా వచ్చి, సంపెంగలవానన పిట్టంతా వ్యాపించింది.

"నువ్వు ఎంతవరకు కొన్నావు టిక్కెట్టు" అని అడిగేడు ఆచారి.

"అనకాపల్లి వరకు. అక్కడ నా స్నేహితురాలి యింటికి వెళ్ళాలి. రే పక్కడనుంచి విజయవాడ వెళ్తాను."

"నాతో యిప్పుడు రాజమండ్రి రారాదా. నాకాపూళ్లో ఏం తోచదు. రెండు రోజులుండి వెళ్ళిపోవచ్చును. మా వాళ్లంతాకూడా ఎంతో సంతోషిస్తారు" అంటూ ఆచారి పార్వతిని బతిమాలేడు. పార్వతి అలాగేనంది.

"రామంకూడా వస్తే బాగుండును".

"అవునోయ్, మాతో రారాదా. నాలుగు రోజులుండి వద్దువుగాని" అన్నాడు ఆచారి.

"అమ్మమ్యో, ఇవాళ మా స్కూలు తెరుస్తారు. వెళ్ళాలి."

"ఏమిటోయ్, ఇంతోటి అయ్యవారి వుద్యోగానికే భయ పడుతున్నావ్! పోతే పోనీ."

"ఈ అయ్యవారి ఉద్యోగం కూడా వూడిపోతే నేను అడుక్కుతినాలి" అన్నాడు రామం నవ్వుతూ.

"ఏమిస్తారు?"

"ఏదో నూరు రూపాయిలిస్తారు"

"బాగానేవుందే చాలదేమిటి, మీరుచెప్పే చదువుకి"

పక్క బెంచీమీద కూర్చున్న ఇద్దరు యువతీ యువకులు యీ మాట విని పకపక నవ్వేరు. ఆచారికూడా వాళ్ళవేపు నవ్వేడు.

"అవునండీ, మనదేశంలో టీచర్లు పిల్లలకేం చెప్తారు. తమదగ్గర ప్రైవేటు చెప్పించుకునే పిల్లల్ని ప్యాసుచేస్తారు. కాని ఆ కురక్రుంకల్లో మహా యమయాతన లెండి. మేస్టర్లకి పేర్లు పెట్టేస్తారు; ఏడిపిస్తారు. అసలు వీళ్ళకిచ్చేజీతాలు ఆ కష్టానికే ఇస్తారు... అసలు స్కూల్సు అంటే అమెరికాలోనే సుమండి, నేను అమెరికాలో వున్నప్పుడు ..."

"ఓ. మీరు అమెరికా వెళ్ళివచ్చారా?" అంది యువతి.

"ఆ రెండేళ్ళున్నానులెండి. కాలిఫోర్నియా యూని వర్సిటీలో రిసెర్చి చేసేను."

"సారీ, ఏదో చెబుతూంటే అడ్డొచ్చాను."

"అక్కడ నా కొక లేడీ టీచరు ఫ్రెండ్ ఉండేది, ఆవిడతో కలిసి ఒకసారి వాళ్ళస్కూలుకు వెళ్ళాను. ఓహో,

ఏం క్రమశిక్షణ! ఏం శ్రద్ధ! ఏం టీచింగ్! అంతేకాదండీ, బాంబులు, విమానదాడులు వచ్చినప్పుడు ఎలా ప్రవర్తించాలో అన్నీ చక్కగా నేర్పుతారు.

ఎడ్యుకేషన్ అంటే ఏమిటి ? లోకజ్ఞానమేకదండీ. అలాంటి ట్రెయినింగు వుండబట్టే అమెరికావాళ్ళు అంత గొప్ప వాళ్ళయారు, ఏమంటారు?"

"నిజమేనండీ- ఏదైనా కుర్రవాళ్ళను తయారుచెయ్యడంలో వుంటుంది" అన్నాడు యువకుడు.

"అమెరికాలో లైఫ్ బాగుంటుంది కదండి !" అన్నది యువతి.

"అమెరికన్లకు లైఫ్ అంటే ఎడ్వెంచరేనండీ!" అంటూ ఆచారి అమెరికన్ ప్రెసిడెంటులా పోజ్ పెట్టాడు. లేచి వాళ్ల బెంచీదగ్గరకెళ్ళి స్టేట్స్ఎక్స్ప్రెస్ సిగరెట్ యువకుడికి అందించి అక్కడ కూర్చోబడ్డాడు. అమెరికా గురించి ఎవరేనా తన్ను అడిగితే ఆచారి వొళ్లుమరచిపోతాడు. అందులోకీ ఆయువతి నోరు విడిచి అడిగిందాయెను! అదీ మామూలు అమ్మాయా! ఆధునిక నవనాగరిక యువతి. పెదవులకి ఎర్ర రంగు వేసుకున్నయువతి. అమెరికా అంతటి భూతలస్వర్గం గురించి తెలుసుకోవాలని ఎవరికుండదు, ఎవరో పార్వతి లాంటివాళ్ళకి తప్ప. పార్వతి నిర్లక్ష్యం ఆచారికి నచ్చలేదు.

అమెరికాలో హోటల్సు గురించీ, సినిమాలగురించీ, హాలీవుడ్ నటీమణులగురించీ, ఆడవాళ్ళగురించీ, ఆచారాలగురించీ, ఆచారి చాలసేపు వాళ్లకి ఉపన్యాసమిచ్చేడు. ఆ యువతి ఇదంతా వింటూ తన్మయీ భావంలో మైమరచి తనభర్త

భుజాలమీాదవాలి తను ప్రస్తుతం అమెరికా భూతలస్వర్గంలోనే వున్నట్లు భావించుకుంది.

"అదేమిటి ఆచారి వాళ్ల దగ్గర కెళ్లి తిప్పవేశాడు" అన్నాడు రామం.

వాళ్లంతా "నాగరికులు కదా మరి!"

"ఊఁ, బావుంది, కాని కొంపదీసి వాళ్ళంతా ఇక్కడ డాన్సుచెయ్యడం మొదలెట్టరుగద!"

పార్వతి నవ్వలేదు. బుర్రదించుకుని కాలిగోరుతో నేలనురాస్తూ ఏదో ఆలోచిస్తూంది. ఆ మొహంలో ఏవో వ్యక్తావ్యక్తమైన భావాలు, ఏదో తెలియని అసంతృప్తి కని పిస్తున్నాయి. ఆమె తన భావిజీవితం గురించే ఆలోచిస్తూంది. తన కీ ఏడాదితో ఆనర్సు పూర్తికావస్తూంది. ఆ తరువాత ఏమిటి చెయ్యడం. వివాహం చేసుకోవడం, కాపరం చెయ్యడం. అంతేనా? కాపరంకూడా బాగానే ఉండవచ్చును. అయితే ఈ ఐహిక జీవితానికి పరమావధి ఏది? ఐశ్వర్యమా, విలాసమా? భౌతిక ఆనందమా? కేవలం విలాసాలలో తన కానందం ఆత్మసంతృప్తి కలగదు. కోరేది మానసిక వికాసం, జ్ఞానాన్వేషణ. జ్ఞానమనేది సర్వోత్కృష్టమైనది. అదే జీవితానికి ఆనందాన్నీ, తృప్తినీ, పరిపూర్ణత్వాన్నీ కలిగిస్తుంది. ఈ తృప్తిని తను భావిజీవితంలో పొందగలదా? తన వైవాహిక జీవితం యీ ఆనందాన్ని అందిస్తుందా? వైవాహిక జీవితాన్ని తప్పించుకోలేము. అయితే ఎటువంటి వివాహం. ఎటువంటి భర్త, ఎటువంటి ప్రేమ? పార్వతి బుర్ర ఆలోచనలతో బరువెక్కిపోయింది.

ఆమె తలెత్తిచూసింది. రామం తనవేపే చూస్తున్నాడు. తనావిధంగా చూడడం ఆమెగ్రహించిందని రామం తెలుసుకుని సిగ్గుపడ్డాడు. అత నింతసేపూ పార్వతిగురించే ఆలోచిస్తున్నాడు. పార్వతి మనస్తత్వం, భావాలు తనకు బాగా తెలుసు. ఆచారితో ఆమె జీవితం ఎలా వుంటుందో అనుకుంటున్నాడు. వారిద్దరిలో భావసమైక్యత ఎలా వుండగలదు? వారిద్దరివీ విభిన్న సంస్కారాలు, విభిన్న దృక్పథాలు, విభిన్నభావాలు. వారి తాత్త్వికపునాదులే విభిన్నం. అలాంటి వారి జీవితంలో ఆనందం వుంటుందా? ఛీ ఏమిటీ ఆలోచనలు? దృక్పథాలనేవి శాశ్వతంగావు! వా రిద్దరూ వొకరినొకరు ఇష్టపడినప్పుడు తన కెందు కీ ఆలోచనలు? తనలో ఏమూలైనా ఈర్ష్యగాని అసూయగాని పొంచిలేదుకద !

"ఏమిటాలోచిస్తున్నావు ?" అంది పార్వతి గాలికి ఎగురుతూన్న తలవెంట్రుకలు సర్దుకుంటూ.

"అబ్బే, ఏమీలేదు. అమెరికా వెళ్ళివచ్చాక ఆచారి చాలా మారిపోయాడు సుమా."

"ఆహా! అంతా మారిపోయింది! ఆ రంగుతప్ప! పాపం, ఆ శరీరపు రంగు మార్చుకోవాలన్నా మారేది కాదాయెను!"

ఇంతలో బండి సింహాచలం స్టేషనుకు వచ్చి ఆగింది. ఆచారీ, ఆయువతీ యువకులూ ఏదో మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు. బండి నిలబడగానే వాళ్లూ నవ్వులు నిలబట్టేరు. అమ్మయ్య ! వాన వెలిసినట్టు ఒక్కసారి నిశ్శబ్దమైంది.

చూస్తూండగానే పెట్టెలోకి జనం ఒక్కసారిగా తొంపర తొందరగా ఎక్కిపోయారు. బండి కదలిపోయింది. జనం

లోపలికొచ్చి తమ తట్టలు సర్దుకుంటున్నారు. అంతా పల్లెటూరి ఆడవాళ్ళు.

"ఇదేమిటర్రా, యీ పెట్టె కాదు, దిగండి, పోండి !" అన్నాడు ఆచారి చిరాగ్గా.

"బండి కదలిపోనాదికదా. ఒక్క పది నిమిషాలే బాబయ్యా, ఓట్టేరులో దిగిపోతాం" అన్న దొకామె. ఆమె ఆజానుబాహురాలు. నల్లటి దృఢమైన శరీరం. పెద్ద కళ్ళు. విశాలమైన నుదుటిమీద రూపాయంత కుంకుమబొట్టు. నవ్వితే సొట్టలుపడే బుగ్గలు. ఆరోగ్యవంతమైన సౌందర్యం.

"ఛీ, ఛీ ,మీబాబుగారిసొమ్ములా ఎక్కిపోయారు. పైపెచ్చు మాట్లాడంకూడానా" అని గట్టిగా కేకలేశాడుఆచారి.

"ఎవరి బాబుగారి సొమ్మూకాదు బాబు, సర్కారుబండి. డబ్బిస్తే ఎవడినేనా ఎక్కనిస్తాడు" అంది ఆమె నవ్వుతూ.

"ఛీ, పో, డబ్బిస్తేమాత్రం ఈ వెధవతట్టలన్నీ ఏమిటి బండంతా న్యూసెన్సు" అంటూ ఆచారి ఆముదం తాగినవాడిలాగా మొహంపెట్టేడు.

"తట్టల్లో పాలకుండలు బాబూ, పాలు"

"ఛీ, వెధవపాలు, పాలుట, పాలు"

"ఆ ఎదవపాలు నేకపోతే మీ పిల్లలకి గడవదు బాబయ్యా. అసలు మీకు కాఫీ లెలంగొస్తాయ్ బాబూ, కాఫీలు" అంది ఆ స్త్రీ నవ్వుతూ. తక్కిన ఆడవాళ్ళంతాకూడా పకపక నవ్వేరు. ఆచారికి ఒళ్ళు మండింది. మండదూమరి ఏమిటా న్యాయం.

"ఛీ, వెధవముండా, ఇంకా నాతో వాదిస్తావా"

"ఏటి బాబు తిడతావేటి, మంచోడివే" అంది ఆమె చిరాగ్గా. ఈ అల్లరంతా చూసి పార్వతి దగ్గరగావచ్చి "పోనీండి మన కెందుకు వాళ్ళతోటి. వాళ్ళే దిగిపోతారు, తిట్టకండి" అంది.

"నీ కెందుకు మధ్య లో, వొట్టి 'స్టుపిడ్'లా మాటాడకు" అన్నాడు ఆచారి కోపంగా. పార్వతి చిన్నబుచ్చుకుంది. నలుగురిలో అలా అంటే ఎవరి కేనా ఎలా వుంటుంది మరి. కాని ఆమె మాట్లాడ లేదు.

"తల్లి, మాలచ్చిమి, పదికాలాలపాటు పసుపూ కుంకం ఎట్టుకుంటాది తల్లి! చినబాబూ మంచోడే కొంచెం సిరుకోపం గానీ" అంది ఆమె.

"ఛీ, రాస్కెల్, నోరుముయ్"

"ఏటి, తిడతావేటి బాబూ, నే తిడితే ఎలాగుంటాది. సదివినోడివిగదా, గ్యానం లేదూ?"

"వెధవముండ, నీ కళ్ళు నెత్తిమీదికొచ్చాయ్, తిడతానా తంతానా, ఇంకాను" అని ఆచారి కోపంతో వొళ్ళు మరచి ఆడదాని తట్టమీద కాలుతో తన్నేడు. ఆచారి తొడుక్కున్న బూటు రాయిలాగుంది. అమెరికాలో తయారయింది. మహాగట్టిసరుకు. ఆ తన్నుకి బుట ఎగిరిపడి లోపలి పాలకుండ బద్దలైంది. తెల్లటి, చిక్కటిపాలు పెట్టెనిండా వొలికి ధారలుకట్టి పారింది. ఆడదానికి ఒక్కసారిగా కోపం, ఏడుపు, దుఃఖం పొర్లుకొచ్చాయి.

"ఒలమ్మో సచ్చినోడు పాలకుండ పగలగొట్టేసినాడే, ఓరి వెదవకొడకా, నీకేం పోగాలంరా, నాకొడకా" అని పెద్ద

కేక పెట్టి అరచింది. ఆమె వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది. తక్కిన ఆడవాళ్ళు దానిని పట్టుకుని ఊరుకోబెట్టేరు.

విరిగిన కుండ పెంకులు కాలితో తోస్తూ ఆచారి బెంచీ మీాదున్న యువతీ యువకులను చూసి నవ్వేడు. వాళ్లు కూడా పళ్ళిగిలించి పకపకనవ్వేరు. "వెధవ ముండకి తగిన శాస్తిచేశారు" అంటూ ఆచారి నభినందించేడు యువకుడు.

"అవునండీ, యీా దేశంలోగాబట్టి సరిపోయింది. ఇదే అమెరికాలోనే అయితేనా" అన్నాడు ఆచారి. ఇలాంటి తప్పుకి అమెరికాలో అయితే మరణశిక్షే అయివుంటుంది, అనుకుంది యువతి.

"అమెరికాలో ఐతే వెంటనే పోలీసుల్ని పిలిపించి..." అనబోయాడు యువకుడు.

"ఈ మాత్రానికి పోలీసుల్నికూడా ఎందుకండీ, బండిలోనుంచి క్రిందికి తోసేయడమే" అన్నాడు ఆచారి.

పార్వతికి ఆచారి ప్రవర్తన చాల అసహ్యంగావుంది. నిజమే, వీళ్లు మూడోక్లాసు టిక్కెట్లుకొని ఇంటరులో ఎక్కవుంటారు. తప్పేకావచ్చును. అయితే యీాఆడదానిని శిక్షించటానికి ఆచారి కధికార మెవరిచ్చారు. కావాలంటే రైలు వాళ్లతో ఫిర్యాదు చెయ్యాలి. అంతేకాని ఈదౌర్జన్యమేమిటి?

పార్వతి పాలమనిషివేపు తలెత్తిచూసింది. పాలమనిషి చీరకొంగుతో కళ్లనీళ్లు తుడుచుకుంటూంది. కష్టపడి పశువులను పెంచి, పోషించి, చేతులార పిదికినపాలు, తెల్లటి, చిక్కటి పాలు, తనకు, అనేకమందికి జీవనాధారమైన పాలు ఇలా నేలచిమ్మి ధారలుగట్టిపోతూవుంటే ఆమె కెలావుంటుంది మరి!

ఆమెలో దుఃఖం పొర్లుకొచ్చింది. తన కన్యాయం చేసిన వాళ్లమీద ద్వేషంతో, ఆగ్రహంతో ఆమె కళ్లు ఎర్రబడ్డాయి. పాపం, మరో పావలాడబ్బు లెక్కువిస్తే యీ పెట్టెలో కూర్చునే అధికారం సంపాదించుకునివుండేది. కాని ఆ పావలా సంపాదించడం ఎంతకష్టం?

ఇంతకీ ఆమె ఏ టిక్కెట్టుకొన్నదో ఆచారికి తెలీదు. కాని వాళ్లు కట్టులోనూ, బొట్టులోనూ, వేషభాషల్లోనూ అనాగరికులు! దరిద్రులు! అలాంటివారు తనతో సరిసమానంగా వచ్చి కూర్చోవడం అతనికిష్టంలేదు. అసలు వాళ్లనిచూస్తేనే అసహ్యమేసింది. వాళ్లకి సభ్యత తెలియదు; తనకే సభ్యత తెలుసును. తనే నాగరికుడు, విద్యావంతుడు. అనాగరికుల మీద తనకు అధికారముంది! వాళ్ల పాలకుండ బద్దలుకొట్టినా తన్నినా, బండిలోంచి తోసేసినా తను నాగరికుడే. అనాగరికులమీద దౌర్జన్యం "నాగరిక" లక్షణం.

వాల్తేరు స్టేషను వచ్చి బండిఆగింది. పాలవాళ్ళంతా తట్టలుపట్టుకు దిగిపోతున్నారు. ఈ పాలమనిషి మాత్రం వొట్టితట్ట చేత్తోపట్టుకుని విచారంగా కూర్చుంది. పార్వతి దగ్గరగా వెళ్ళి "నువ్విక్కడ దిగుతావా?" అని అడిగింది.

"దిగిపోతాను తల్లీ, నీ కెందు కా కష్టం?"

"నీ కెంత నష్టమైంది ఇవ్వాళ?"

"ఎనిమిది రూపాయల పాలు తల్లీ. అన్నీ నేలపాలైనాయి. ఏ నా కొడుకుమొగం సూసినానో ఇయాల" అంటూ తట్టపట్టుకొని బండి దిగింది.

"ఏమ్, పాలమ్మా, మాట, ఇలారా. ఇదుగో ఆయన కోపంమీద అలాచేశారు. విచారించకు" అంటూ పార్వతి పాలమనిషి చేతిలో ఎనిమిది రూపాయలు పెట్టింది. పాల మనిషి పార్వతికి దండంపెట్టి వెళ్ళిపోయింది.

ఆచారి ఇదంతా చూస్తూనేవున్నాడు. కాని మాటాడ లేదు. అటూయిటూ పచారు చేశాడు. తను శిక్షించిన పాలమ్ముకునే పల్లెటూరి ఆడదానిదగ్గర పార్వతి క్షమాపణ చెప్పుకోవడం నిజంగా ఎంత అవమానకరం! ఆచారికి పార్వతి మీద కోపంవచ్చింది. ధుమధుమలాడుతూ బెంచీమీద సైపు వెలిగించి గుఫ్ గుఫ్‌మని పొగవదిలాడు.

ఇద్దరి దగ్గర సెలవుపుచ్చుకుని రామం బండి దిగాడు. పార్వతికూడా చటాలున లేచి నిలుచుని "నేనుకూడా వస్తున్నా ఉండు రామం, నాకూ పనుంది, యూనివర్సిటీకి వెళ్లాలి" అంది.

ఆచారి పార్వతి మొహంవేపు తీక్షణంగా చూసి "నాతో రావా, ఐతే" అన్నాడు.

"క్షమించండి, రాలేను."

ఆచారి మాటాడలేదు. అవమానంతో వొళ్లు మండి పోతూంది. వాళ్ళిద్దరూ గేటుదాటి బయటకి వెళ్లడం కిటికీ లోంచి చూశాడు.

"ఒట్టి మూర్ఖులు, అనాగరికులు" అనుకున్నాడు ఇంగ్లీ షులో ఆచారి. కాని అతనిమనస్సుకు శాంతికలుగలేదు. ప్రక్కనున్న పత్రిక తీశాడు చదువుదామని. పత్రిక మీదున్న హాలీవుడ్ సినీమాతార తన్నుచూసి నవ్వుతున్న ట్లనిపించింది ఆచారికి.